క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



తాగునీటి పథకం మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రామారావు

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ మజ్జిపుట్టు గ్రామంలో తాగునీటి పథకానికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు రూ.2లక్షలతో మరమ్మతులు చేపట్టి డ్రైనేజీ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మరమ్మతుల పనులను ఎంపీటీసీ సభ్యుడు బురిడి రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరమ్మతుల పనులను వేగవంతం చేసి నాణ్యతగా పనులు చేపట్టి తాగు నీటి పథకాన్ని అందుబాటులో తీసుకురావాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలకు గిరాకీ



సొవ్వలో క్యారెట్‌ను శుభ్రం చేసి సంతకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

డుంబ్రిగుడ: సంతల్లో కూరగాయలకు గిరాకీ లభిస్తోంది. మండలంలోని సొవ్వ, సాగర, గసభ, కోల్లాపుట్టు, కొర్రాయి పంచాయతీల్లో గిరిజన రైతులు ముమ్మరంగా కాయగూరలను సాగు చేస్తున్నారు. గిరిజనులు సాగు చేస్తున్న క్యారెట్, ముల్లంగి, చిలగడ దుంపలు, బీట్ రూట్ తదితర కాయగూరలను సంతల్లో విక్రయిస్తున్నారు. మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారని, ప్రస్తుతం ఆశించిన ధరలు వస్తున్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు.

31న మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్ : నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా నర్సీపట్నంలో ఎంఎల్‌ఏఎస్ కళాశాలలో ఈనెల 31న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుని 18 నుంచి 25 సంవత్సరాలు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మర్ని వివరాలకు 7036363272 నంబరులో సంప్రదించాలని కోరారు.

జాతీయ రహదారిపై కంటెయినర్ బోల్తా



బోల్తా పడిన కంటెయినర్

పాయకరావుపేట : పట్టణంలో గల లింగాలకాలనీ సమీపాన గల జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కంటెయినర్ బోల్తా పడింది. రాజమండ్రి నుండి విశాఖపట్నం వైపు వెళ్తున్న దానిమ్మ, కమలా ఫలాల లోడుతో వెళ్తున్న కంటైనర్ సడన్‌గా బ్రేక్ వేయడం కారణంగా బోల్తా పడింది. దీనివల్ల ఎవరికీ ప్రమాదం జరగలేదు. సుమారు 2 గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్టు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష సదుపాయం

మునగపాక : మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష సదుపాయం ఆదివారం నాటికి 5 వరోజుకు చేరుకుంది. అయ్యప్ప మాలలు ధరించిన భక్తులతో పాటు ఇతర భక్తులు కూడా మధ్యాహ్నం సమయంలో భిక్ష చేసేందుకు వీలుగా కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు. మునగపాకతో పాటు ఇతర ప్రాంతాల్లో మాలలు ధరించిన భక్తులు ఇక్కడి భిక్ష సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. 50 రోజుల పాటు భిక్ష అందించేందుకు నిర్వాహకులు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు విరాళాలు అందిస్తుండడం విశేషం.

అంతర్రాష్ట్ర రహదారికి మోక్షం

- రూ.3.3 కోట్లతో నిర్మాణం
- వాహన చోదకులకు తప్పనున్న ఇబ్బందులు

ఏళ్ల తరబడి అంతర్రాష్ట్ర రహదారికి మోక్షం కలిగింది. గడిచిన కాలంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా చేయలేని పనిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించింది. తాజాగా గూడెం–సీలేరు రహదారిలో రెయిన్ గేజ్ నుంచి నిర్మాణం చేస్తున్న రోడ్డు పనులు పూర్తయ్యాయి. అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవతో రూ.3.3 కోట్లను విడుదల చేయించారు. ఆయా నిధులతో పది కిలోమీటర్ల పొడవైన రహదారిని పూర్తి చేశారు. పనులను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించి, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేస్తున్నారు. గడువులోగా పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



కోడిమామిడి నుంచి సరాపల్లి, బూసుపల్లి రోడ్డు పనులను పరిశీలిస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: ఏళ్ల తరబడి వాహనచోదకులు పడుతోన్న కష్టాలు తీరాయి. గడచిన పది సంవత్సరాల నుంచి రహదారి సరిగ్గా లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.తాజాగా రహదారి పది కిలోమీటర్ల మేరకు పూర్తయింది. దీంతో సీలేరు నుంచి గూడెం వరకు ఉన్న 50 కిలోమీటర్ల రహదారిలో 40 కిలోమీటర్లు ప్రయాణానికి అనువుగా మారింది. సీలేరు పవర్ ప్రాజెక్ట్ నుంచి 30 కిలో మీటర్ల రోడ్డును ఇది వరకు రూ.15.4 కోట్లతో అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఇవతల వైపు పది కిలోమీటర్ల రహదారి కలెక్టర్ ఆదేశాలతో పూర్తయింది. దీన్ని అధికారులు పరిశీలించారు. ఇక నూతిబంధ నుంచి గూడెం వరకు పది కిలోమీర్ల రహదారికి అంచనా నివేదిక కోసం కలెక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ పది కిలోమీటర్లు కూడా పూర్తయితే మొత్తం రహదారి అంతా బాగుంటుంది. జిల్లా ఒకటి కావడంతో సీలేరు మీదుగా చింతూరు, ఎటపాకతో పాటు అనేక ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు దీనిని ఎంచుకుంటున్నారు. అయితే రహదారి బాగోకపోవడంతో ఇటువైపు నుంచి ప్రయాణాలు తగ్గించారు.ఇప్పుడు రహదారి బాగోవడంతో ప్రయాణికుల రద్దీ పెరగనుంది.



పూర్తయిన రహదారి

ఇక రహదారి సరిగా లేక ఇంత వరకు భద్రాచలం, హైదరాబాద్, మల్కన్‌గిరి వెళ్లే బస్సులు ఏదో ఒక చోట నిలిచిపోతున్నాయి. దీని మూలంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పుడు ఆ సమస్యలు తప్పనున్నాయి.

జి.మాడుగుల: మండలంలోని కోడిమామిడి–కిల్లంకోట పంచాయతీ కేంద్రానికి 7 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.45 కోట్లు, కోడిమామిడి–సరాపల్లి, బూసుపల్లి వరకు 8 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ.2.80కోట్లు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.ఆయా రోడ్డు నిర్మాణ పనులను మాజీ వార్డు నెంబర్ టి.చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు తెరవాడ రామారావు, గిరిజనులు దగ్గరుండి చేయిస్తున్నారు. దీంతో రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



కోడిమామిడి-కిల్లంకోట రహదారి పనులను పరిశీలిస్తున్న అధికారులు

బిర్సా ముండా జయంతి పోస్టర్ ఆవిష్కరణ

ముంచంగిపుట్టు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో నవంబర్ 14, 15వ తేదీల్లో జరిగే భగవాన్ బిర్సా ముండా 149వ జయంతి వేడుకలు అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ముక్కి శేషాద్రి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బిర్సా ముండా జయంతి ఉత్సవాల గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఉత్సవాల్లో గిరిజన సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహణ, గిరిజన చట్టాలు అమలు తీరు, పరిరక్షణ వంటిపై ఈ కార్యక్రమం ద్వారా జరుగుతాయన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.జి.దొర, ఆదివాసీ ఉద్యమ జెఏసీ నాయకులు ముక్కి రామకృష్ణ, గిరిజన సంఘం నేత ఎం.ఎం.శ్రీను, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



బిర్సా ముండా జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలి

మారేడుమిల్లి: ప్రభుత్వం అమలు చేసే పథకాలు ప్రతి ఇంటికి అందాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక ఆదివాసీ వర్తక కేంద్రం వద్ద కన్వీనర్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై మండల స్థాయి సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులకు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ ఒకటోవ తేదీన నుంచి మండలంలోని సచివాలయం పరిధిలోని నిర్వహించే కార్యక్రమాలు ద్వారా పథకాలు గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలన్నీ భవిష్యత్తులో కొనసాగాలంటే ఆంధ్రప్రదేశకు జగనన్నే కావాలని ప్రజలకు వివరించాలన్నారు.



మాట్లాడుతున్న కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి

అనంతరం పార్టీ శ్రేణులకు పథకాల కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్‌లు కొండ జాకబ్, కుండ్ల ప్రభాకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ బోడ్డేటీ వీరబాబు, కో–ఆప్షన్ సభ్యుడు గురుకు దర్మరాజు, జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), మండల కార్యదర్శి బి.గంగరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు

అనకాపల్లిటౌన్ : ధర్మప్రచార వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయని నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న ప్రారంభమైన వారోత్సవాలు వారం రోజుల నేత్రపర్వంగా జరిగాయని చెప్పారు. ఈ వారం రోజులు శ్రీ మరిడి మహాలక్ష్మి భజన బృందంచే బైటో భజన, అమృత వర్షిణి బృందంచే కోలాటం, శ్రీగౌరీలలితా ప్రార్థనా మండలిచే పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయన్నారు. వారోత్సవాలకు సహకరించిన పలు భక్తి బృందాలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, పలు బృందాల సభ్యులు పాల్గొన్నారు.



వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న కొణతాల మురళీకృష్ణ

మోదకొండమ్మ ఆలయంలో వీధి పండగల సందడి



పూలు, నగలతో మాడుగుల మోదకొండమ్మకు అలంకరణ



అమ్మవారిని దర్శనానికి ఘటాలను శిరస్సున పెట్టుకుని బారులు తీరిన భక్తులు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భారీ స్థాయిలో వీధి పండగలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వందలాది మంది అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను శిరసున పెట్టుకుని కాలినడకన ఆలయానికి చేరుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వీధి పండగలతో పాటు అధిక సంఖ్యలో సాధారణ భక్తులు కూడా ఆలయానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి కిలో మీటరు మేర భక్తులు క్యూ లైన్లో నిరీక్షించారు. అమ్మవారి మండపంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. ఉచిత ప్రసాద వితరణ జరిపారు.

ఉత్సాహంగా చిల్డ్రన్ క్లబ్

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు మాస్ రీడింగ్‌లో భాగంగా సింహం రాజు తెలివి, కష్టజీవి గెలుపు కథలను లైబ్రేరియన్ దమయంతి వివరించారు. నీతి కథల ద్వారా జ్ఞానంతోపాటు, నైతిక విలువలు పెంపొందించుకోవచ్చన్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పిల్లలచే పజిల్ గేమ్ ఆడించారు. ప్రతి ఆదివారం నిర్వహించే చిల్డ్రన్స్ క్లబ్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విద్యార్థులకు సూచించారు.

రేపు పుల్లంగిలో గడప గడపకు

మారేడుమిల్లి: మండలంలోని పుల్లంగి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 10.30 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు సీతగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదబయలు: మండలంలోని సీతగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య తెలిపారు. సచివాలయం పరిధిలోని గ్రామ వలంటీర్లు వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి టోకెన్లు అందించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే శిబిరంలో వైద్య నిపుణులు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు

అనకాపల్లిటౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై ఈనెల 31వ తేదీ వరకూ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరట్ల నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరజీవి జీవిత చరిత్రపై క్లుప్తంగా ఎ–4 సైజ్ పేపరుపై రెండు పేజీలు రాసిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.116, ద్వితీయ, తృతీయ బహుమతులుగా కానుకలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కె.కోటపాడు: పలు గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎ.కోడూరు, ఎ.భీమవరం, గొండుపాలెం తదితర గ్రామాల్లో గల మండపాలు, ఆలయ ప్రాంగణాల్లో గౌరీ పరమేశ్వరులను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలను జరిపారు. ఏటా విజయదశమి పర్వదినం తర్వాత వచ్చే పౌర్ణమి నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను జరపడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు పంట పొలాల్లో నుంచి వరి దుబ్బుల్ని తీసుకొచ్చి, గౌరమ్మగా కొలుస్తారు. శనివారం గౌరమ్మను తలపై పెట్టుకుని ఊరంతా ఊరేగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజైన ఆదివారం గౌరీ నందీశ్వరులను పల్లకిలో ఉంచి ఊరంతా ఊగించారు.



గౌరీపరమేశ్వరులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

చింతూరు: వరదల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకునే ప్రజల కోసం మంజూరైన తాగునీటి బోర్లు ఏర్పాటుకు ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చిచ్చడి మురళి మాట్లాడుతూ వరదల సమయంలో ముంపు ప్రాంతాలకు చెందిన ప్రజలు పునరావాస కేంద్రాలతో పాటు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటారని తెలిపారు. అక్కడ వారికి తాగునీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడతున్న విషయాన్ని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించి జెడ్పీటీసీ నిధుల కింద చింతూరు మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో వేసేందుకు 15 తాగునీటి బోర్లను మంజూరు చేశారన్నారు. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని ఏజీ కొడేరు, ఉలుమూరు గ్రామాల్లో ఏర్పాటుచేయనున్న రెండు బోర్లకు వారు శంకుస్థాపన చేశారు. ప్రజల ఇబ్బందులపై స్పందించి తాగునీటి బోర్ల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు అగరం సుబ్బలక్ష్మి, కారం కన్నారావు, ఉప సర్పంచ్‌లు రమేష్, విప్లవకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి, ఎంపీపీ అమల,నేతలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ముంచంగిపుట్టు: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ కె.రవీంద్ర అన్నారు. మండలంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన మార్గంలో కుజభంగి, కొత్తూరు జంక్షన్ల వద్ద ఆదివారం నియంత్రణ సూచిక రేడియం స్టిక్కర్ల డ్రమ్ములను పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అతి వేగంగా వాహనాలు నడుపుతూ ఉండడంతో వాటిని నియంత్రించాలనే ఉద్దేశ్యంతో రేడియం స్టిక్కర్ల డ్రమ్ములను ఏర్పాటు చేశామన్నారు. వాహనాదారులు నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, అన్ని రకాల రిక్డారులు కచ్చితంగా ఉండాలని ఆయన కోరారు. సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



కుజభంగి జంక్షన్‌లో రేడియం స్టిక్కర్ల డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ రవీంద్ర,పోలీసులు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి





రంపచోడవరం, పెదబయలు మండలాల్లో ఎన్నికైన యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

రంపచోడవరం : యూటీఎఫ్ రంపచోడవరం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలకు అధికారిగా జిల్లా కార్యదర్శి కె.ఆదిరెడ్డి, పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు వై.వి ల్సన్ బాబు, ముఖ్య అతిథులుగా జిల్లా కోశాధికారి కె.కృష్ణ, కుటుంబ సంక్షేమ బోర్డు డైరెక్టర్ జి.విశ్వరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడిగా సీహెచ్. సనాతన్ బాబు , గౌరవాధ్యక్షుడిగా డి. టాల్ స్టాయిబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సూరిబాబు, అసోసియేట్ అధ్యక్షురాలుగా సీహెచ్ మౌనిక, కోశాధికారిగా డిపి లింగన్న, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంగళరావు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా డి.అనిల్ బాబు, టి.ఎస్.ఆచారి, ఎం.సుస్మిత, పి.పకీర్‌దొర (పత్రికా కార్యదర్శి), పి రాజు (కుటుంబ సంక్షేమ కార్యదర్శి), బి.నరేష్, కె.రాంబాబు, కె.రామకృష్ణ, కె.ఆదిత్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.వీరబాబు (ఆడిటర్), జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.వెంగళరావు, సీహెచ్ సనాతనబాబు, డి.టాల్ స్టాయి బాబు, ఎస్ శ్రీరాములు దొర,కె సత్యవేణి,పి మంజుల మహిళా కమిటీ,కె సత్యవేణి (కన్వీనర్), మరో 12 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

పెదబయలు: ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యూటీఎఫ్ జిల్లా నాయకులు అన్నారు. మండల కేంద్రంలో యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు.మండల అధ్యక్షుడిగా గల్లేల సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కమలాకుమారి అలాగే సభ్యులుగా బొంజుబాబు. మాధవరావు. ఆనంద్, శ్రీనుబాబు, వెంకటేష్, బాబురావు. లక్ష్మి, సభ్యులను ఎన్నుకున్నారు. నాయకుడు జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో ఆదివారం ఉమా కోటి లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యదర్శి, ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి జాజుల రమేష్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, బయ్యవరం సర్పంచ్ గొల్లవిల్లి జయ, కన్నూరుపాలెం సర్పంచ్ ఎస్. శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దెపల్లి శ్రీనివాసరావు, గొంతిన శివ ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుశ్శాలువలు కప్పి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు సత్కరించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. బంగారయ్యపేటకు చెందిన బృందం భజన కార్యక్రమం నిర్వహించింది. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



స్వామి వారి సన్నిధిలో భక్తులు

విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ సమావేశం

నర్సీపట్నం: విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం నర్సీపట్నం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ ద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించుకున్నారు. యూనియన్ బలోపేతానికి కలసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని యూనియన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న కోటవురట్ల మండలం, పాములవాక పట్టాలమ్మతల్లి ఆలయం వద్ద వనసమారాధన ఏర్పాటు చేసేందుకు తీర్మానించామన్నారు. యూనియన్‌కు తగు సూచనలు, సహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్న సంఘ సీనియర్ సభ్యుడు వెదురువాడ రామగణేశ్వరరావును యూనియన్ ప్రతినిధులు విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పీబీఎం మోహన్, సాంబశివరావు, కోశాధికారి ఆదినారాయణ శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు.



రామగణేశ్వరరావును సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు